# గోదారమ్మ - 14

గోదారమ్మ ఉత్సుకతను గమనించిన సీత నవ్వుతూ, రామచంద్ర గురించి చెప్పటం కొనసాగించింది.. “సీతా….మీరంటే నాకు ఎప్పటినుంచో ఆరాధన ఉండేది. మీ అందం, చలాకీతనం ని మించి…మీ వ్యక్తిత్వం, మీరు రంగాని పెంచే తీరు చూసి నేనెప్పుడో మీకు ఆకర్షితుడినయ్యాను. పెద్దమ్మగారి వల్ల మీ పరిచయ భాగ్యం కలిగినందుకు ఆనందిస్తూన్న తరుణంలో ఆవిడ నన్ను మీకు దూరంగా వుండమని ఒకసారి హెచ్చరించారు. అప్పుడు ఎంతో బాధ పడ్డా…రంగా కి నన్ను దూరం చేయనందుకు నేనెంతో తృప్తితో, మీ స్నేహ భావమన్నా నిలుపుకోవాలని ఆశ పడుతూ ఉండిపోయాను. తర్వాత నా అదృష్టం కొద్దీ మీకు నా మీద సదభిప్రాయం కలిగింది. కుముద మీద నాకున్న బాధ్యత దృష్ట్యా పెళ్ళి కే దూరంగా వుందామని నిర్ణయించుకున్న నేను, మీరు పెళ్ళికి ఒప్పుకోగానే…కుముద నాకు దూరం అవుతుందేమోనన్న బాధ యే మాత్రం కలగకపోగా…దేముడు నాకు అరుదైన వ్యక్తిత్వం కలిగిన భార్యతో పాటూ రంగా రూపంలో ఇంకో బిడ్డని కూడా ప్రసాదించాడని ఎంతో సంతోష పడ్డాను. అందుకే …మిమ్మల్ని ఇంకో వరం కూడా ఇవ్వమని అడగాలని వచ్చాను. కానీ ఎలా చెప్పాలో తెలియడంలేదు..” అని నసుగుతూంటే….నేను ధైర్యంగా యే విషయం అయినా నాతో మాట్లాడమని చెప్పగా..చెప్పగా మెల్లగా అతను నాతో…” సీతా..మనం ఇద్దరం, మనకీ ఇద్దరు చాలు అని నా ఉద్దేశ్యం. కంటేనే పిల్లలు కాదు, నా దృష్టిలో. నాకు ఇప్పటికే కుముదా, రంగా…ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇక మన మధ్యకు ఇంకో మనిషి రావడం నాకిష్టం లేదు. అందుకు పెళ్ళికి ముందే మీ అనుమతి కూడా తీసుకుందామని అనుకున్నాను…ఇదీ విషయం …మీరేమంటారు ?” అని మెల్లగానే కానీ ధృఢ నిశ్చయంతోనే చెప్పాడు. ” అమ్మా…అప్పుడు నాకు అతని మీద ప్రేమ నిజంగా రెట్టింపు అయ్యింది. నిజానికి కుముద ఆయనకి పుట్టిన బిడ్డ కాదు…రంగా మాత్రం నా కొడుకనే అనుకుంటున్నాగానీ…అతనిలో యే స్వార్ధమూ లేదు. తన రక్తం పంచుకుని బిడ్డ పుట్టాలని కోరుకుంటారు ఎవరైనా…కానీ అతను, ‘నా బిడ్డ’ నే చాలు అనడంతో నేనెంతో పొంగిపోయాను. నిజానికి ఆ విషయం అడగాల్సింది నేను. కానీ నా కన్నా ముందే అతను ఆ విధంగా ఆలోచించి..నిర్ణయం తీసుకోవడం, నన్ను అనుమతి అడగటం..నాకెంతో నచ్చింది. వెంటనే అదే విషయం అతనితో చెప్పాను. అర్ధమైంది కదమ్మా… మేం ఇద్దరం కూడా ఇంకా పిల్లలు కావాలని అనుకోవటం లేదు. వీళ్ళిద్దరూ ఉన్నారుగా, చక్కగా పెంచి ప్రయోజకుల్ని చేయాలనేదే మా ఆశ! అయినా మీరే చెప్పండమ్మా…. తల్లిదండ్రులంటే… పిల్లల్ని ప్రేమగా పెంచి పెద్దచేసే వాళ్ళేగా… కనటం లేకపోయినంత మాత్రాన… వీళ్ళు మా పిల్లలు కాకుండా పోతారా…?”

గోదారమ్మ మొహం వికసించింది.

“నిజంగా సీతా… మీరిద్దరూ చాలా గొప్పగా ఆలోచించారు! నా అంచనా ఎప్పుడూ తప్పు కాదు. నాకెంతో గర్వంగానూ సంతోషంగానూ ఉంది. చాలా మంచి మాట చెప్పావు!” అంటూ ఆనందంగా సీతను హత్తుకుందావిడ.

“సీతా… ఇలా మీరిద్దరూ ఒకే రకమైన భావాలను కలిగి వుండటం, ఒకరి ఇష్టాలను మరొకరు గౌరవించటం…చక్కగా కలిసి మెలిసి ఇంటా బయటా పనులన్నింటినీ చక్కబెట్టుకోవటం చూస్తుంటే…నాకు చాలా ముచ్చటగా ఉంది…! ఒకరికొకరు అన్నట్టుగా ఉండే అనుకూలత వల్లే ఆనందం కలుగుతుంది….! ఇంతకన్నా ఎవరైనా కోరుకునేదేం ఉండదు…! నీలో చాలా మార్పు కనిపిస్తోంది సీతా…!” ఆవిడ ఆనందంగా అన్న మాటలకు సీత కొంచెంగా విస్తుబోయినట్లుగా చూసి… “నాలో మార్పు వచ్చిందంటారా…! నాకేం అలా అనిపించటం లేదే…!” అంది.

“మార్పు… అంటే… నేను వచ్చినపుడు ఒక బాధ్యత గల తల్లిగా పెద్దరికం తెచ్చుకున్నట్లు ఉండేదానివి! ఇప్పుడు చక్కగా నీలో… ఒక యువతిలో ఉండే, ప్రత్యేకమైన ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని చూస్తున్నాను! ఇది మంచి మార్పే…! ఎవరికైనా ప్రతీదశలోనూ ఇలాంటి మార్పు ఉండాల్సిందే! ఇపుడు నువ్వు నీ వయసుకు తగ్గ ఉత్సాహంగా వున్నావు.. ఇది గమనించే నేనన్నాను…!”

ఆవిడ ఇచ్చిన వివరణకు సీత కొంచెంగా తలవాల్చి చిరునవ్వు చిందించింది.

“సీతా… నేనో మాట చెప్పనా… రామచంద్రని చూసినపుడే నాకెందుకో నీకు సరిజోడీ అవుతాడనిపించింది… అదిపుడు నిజమే అయింది కదానిపిస్తోంది! అవునుకదూ? రామచంద్ర పెళ్ళిగురించి నిన్ను అడిగినపుడు ‘రంగాకి మంచి తండ్రిగా ఉండగలనని అనుకుంటున్నారా’ అని అడిగిన తీరూ, ఆమాట నిన్ను బాగా మెప్పించిందనీ అనుకున్నావుకదా… అపుడు నాకూ నా విషయం గుర్తుకు వచ్చింది. చెపుతా విను…?

ఆ కాలంలో..మావారు నన్ను చూడటానికి వచ్చినపుడు… నాన్న అతనితో రెండు నిమిషాలు మాట్లాడి నాతో మాట్లాడమని చెప్పి, ఇపుడే వస్తానంటూ లోపలకు వెళ్ళారు.

అపుడాయన ఒక నిముషం మౌనంగా ఉండి ‘మా అమ్మను ఆప్యాయంగా చూసుకునే కోడలిగా ఉండటం మీ కిష్టమేనా’ అనడిగారు.

నేనూ ‘సమ్మతమే’ నన్నట్లుగా తలవూపాను. ‘తనంటే ఇష్టమేనా’ అనడగకుండా వాళ్ళ అమ్మకు మంచి కోడలిగా ఉండాలని కోరుకోవటం నన్ను మెప్పించింది. ‘తల్లిని ప్రేమించేవాడు.. భార్యనూ తప్పకుండా ప్రేమించగలడనే’ మాటను నేనూ నమ్ముతాను గనుకనే ఇంకేమీ ఆలోచించలేదనుకుంటా.

అంతకు ఓ వారం పదిరోజుల ముందు నాన్నగారి స్నేహితుడు భూషణం గారు మా ఇంటికి వచ్చారు.

అప్పటికి నేను హైస్కూలు చదువు పూర్తిచేసి ఇంటిదగ్గరే ఉంటున్నాను. పెరట్లోని జాజిమొగ్గలు కోసుకువచ్చి గదిలో కూర్చుని మాల కడుతూ నాకు ఇష్టమైన పాట సన్నగా రాగంతీస్తూ పాడుకుంటున్నాను.

“మరుగేలరా ఓ రాఘువా..

మరుగేలరా ఓ రాఘువా..

మరుగేల చరాచర రూప పరాత్పర..

సూర్య సుధాకర లోచనా...

మరుగేలరా..ఓ రాఘువా....

మరుగేలరా..ఓ రాఘువా....ఆ..ఆ..." ఈ పాట ఎప్పుడు విన్నా, పాడినా నాకు పారవశ్యం కలుగుతుంది. అలా పాడుకుంటూనే కళ్ళు మూసుకుని.. పారవశ్యంలో ఉన్న నేను అడుగుల చప్పుడుకి చటుక్కున కళ్ళు తెరిచాను.

నాన్నగారు తిరిగి వెళ్ళిపోబోతోంటే "ఏమిటండీ...?" అనడిగా.

నాన్నగారు నన్ను ఎప్పటిలానే మురిపెంగా చూస్తూ... "నా స్నేహితుడు భూషణం వచ్చాడమ్మా... మేం ఇద్దరం మాట్లాడుకుంటూండగా నీ పాట వినిపించింది. వాడయితే మాటలాపి మైమరిచిపోయాడు. ఓ గ్లాసు మజ్జిగ తెచ్చి ఇవ్వమ్మా... ఇంకో మాట. ఎవరితోనైనా పంపించటం కాదు, నువ్వే తీసుకురా..." అన్నారు.

నన్నే ఎందుకు తీసుకురమ్మన్నారోనని ఆలోచిస్తూనే అమ్మకు చెప్పి మజ్జిగ తీసుకువెళ్ళి ఇచ్చా.

ఆయన గ్లాసు అందుకుంటూనే నన్ను పరికించి చూడటం చూసాక నాకో అనుమానం వచ్చింది.

ఆ తరువాత అది నిజమేనని రూఢి అయింది.

అలా భూషణం గారు నా పాటవిని, ఆపైన నన్ను చూసాక... నన్ను తమ ఇంటికోడలుగా చేసుకోవాలనే కోరికను నాన్నకు తెలియజేయటం జరిగిందట.

ఆ వివరాలన్నీ నాన్న అమ్మకు చెప్పారు. 'ఆస్తిపాస్తుల విషయంగా ఖచ్చితంగా నీ కంటె పెద్దవాడినే గానీ... నీకున్న పేరు ప్రఖ్యాతలను బట్టి సమవుజ్జీని కాదనుకో. అయినా ఆశ పడి అడుగుతున్నాను, మీ అమ్మాయిని మా ఇంటికి పంపిస్తావా' అని ఆయన అంటే... నాన్న 'పిల్లలిద్దరికీ అంగీకారమైతే... పెద్దవాళ్ళుగా మనమూ ఆశీర్వదిద్దాం... అబ్బాయిని ఒకసారి మా ఇంటికి పంపించు..' అని బదులు చెప్పారన్నమాట!

అందుకే ఆయన మా వూరుకీ, ఇంటికీ వచ్చారు.

ఆ అబ్బాయి తన సమ్మతిని తెలియజేసాక. ..'నాకు ఈ పెళ్ళి అంగీకారమేనా' అని నాన్నగారు అడగమన్నారని అమ్మ చెప్పినపుడు కొంచెం ఆశ్చర్యపోయాను. ఎందుకంటే... ఆ రోజుల్లో అమ్మాయిల ఇష్టంతో పని లేకుండా, కేవలం

అబ్బాయి, మగపెళ్ళి వాళ్ళ అంగీకారమే ముఖ్యంగా పెళ్ళిళ్ళు జరిగేవి. నాన్నగారి సంస్కారానికి మనసులోనే నమస్కరించి మెల్లగా తలవూపాను.

అమ్మ ఓ సలహా ఇచ్చింది.. "ఇక్కడ ఏ పనీ చేయకుండా ఆటలు, పాటలతో గారంగా పెరిగావు. అక్కడ వాళ్ళది పెద్ద ఉమ్మడి కుటుంబం. బరువు బాధ్యతలు ఎక్కువగా ఉంటాయేమో, బాగా ఆలోచించుకో....!"

నేను చిరునవ్వుతో అమ్మవైపు చూశాను.

మా ఇంట్లో నలుగురైదుగురు పనివాళ్ళు ఉండేవాళ్ళు. అయినా అమ్మ అజమాయిషీ చేస్తున్నట్లుగానే అన్ని పనులూ చక్కబెడుతూండేది. ఓ రోజు ఒకతను అనటం నేను విన్నాను. "మేమింత మందిమి ఉన్నాం కదా, పనులు చేయటానికీ... మీరూ ఎందుకమ్మా సేయబోతారూ...?" అని అంటే అమ్మ అతనికి ఏం సమాధానం చెప్పిందో తెలుసునా...? "సేవలు చేసే ఒళ్ళే చేవ తీరుతుందని సామెత ఉంది. తెలుసుగా...?" అంది.

అప్పుడు... అమ్మ వాళ్ళది పెద్ద కుటుంబం అని ఆలోచించుకోమని చెప్పిన సలహాకి జవాబుగా అమ్మ చెప్పిన ఆ మాటనే బదులిచ్చాను. నిజమే... బరువు బాధ్యతలకి నాకు భయమేం లేదు. పనులు చేసుకోవటమే మంచిదనే లక్షణాన్ని అమ్మ దగ్గర్నుంచే నేర్చుకున్నాను.

నన్ను అదిలించక, విదిలించక, గౌరవంగా చూసే సంస్కారవంతమైన కుటుంబం అనే నమ్మకం కుదిరింది. అందుకనే నేను మరో ఆలోచనకీ తావివ్వలేదు. అలా మా పెళ్ళి జరిగింది..." అంటూ గోదారమ్మ ముగించగానే సీత ఆత్రుతగా "ఆపేసారేం... చెప్పండమ్మా.... ఆ తర్వాత ఏం  జరిగిందీ...?" అని ఆరా తీసింది.

గోదారమ్మ చిరునవ్వుతో సీతవైపు చూసింది.

"ఆ మధ్య బాల్యంలోని నా ఇష్టాలు, అవీ చెప్పానుగా.. ఇపుడు పెళ్ళి గురించి, అలా నాకు ఎపుడు ఏది గుర్తుకువస్తే ... అది చెప్పుకుపోతుంటా, ఇప్పటికిది చాలు. ఎందుకోగానీ... నిన్ను చూస్తుంటే... చిన్నతనంలోని నన్ను చూసుకుంటున్నట్లే అనిపిస్తుంది! అంతేకాదు... నువ్వేం మాట్లాడినా, నా మనసులోని మాటలే నాకు వినబడుతున్నట్లుగానూ ఉంటుంది! అదిగో... చూడు... రామచంద్ర కూరగాయాలతో వస్తున్నాడు... ఇక వంటపని చూడండి...!"

ఆ మాటలకు సీత తలవూపుతూ "అలాగేనమ్మా నేనేమీ బలవంతం చెయ్యను.... మీ గురించి... మీరు ఎపుడు ఏది చెబితే, అది వింటానంతే...! మీరు నాకు పెద్దమ్మలా.. ఇంటికి పెద్ద దిక్కులా తోడుగా ఉన్నారు. అది చాలు నాకు...!" అంది.

ఆవిడా చిరునవ్వుతో తన గదివైపు అడుగులు వేసింది.

* * *

'పలుకే బంగారమాయెనా...కోదండపాణీ...

పలుకే బంగారమాయెనా...'

మెల్లగా తనలోతాను పాడుకుంటూ కళ్ళుమూసుకున్న గోదారమ్మ "అమ్మా..." అంటూ సీత పిలిచిన పిలుపుకు ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది.

"మీరు.... ఇక్కడ కూర్చున్నారేంటమ్మా...! మీ పాట వింటూ నేనూ అలా నిలడిపోయా. పాటపూర్తయినా, మీరు కళ్ళు మూసుకుని అలాగే ఉండిపోతేనూ, పిలిచాను...!" అంది సీత.

ఆవిడ చిరునవ్వుతో జవాబు చెప్పింది. "నీకోసం చూస్తే నువ్వు కనబడలేదు. ఏదయినా పనివుండి... బడినుండి ఇంకా రాలేదేమోనని అనుకుని ఇక్కడ కూర్చున్నా. పాటలు వినటం సరే, చక్కగా గొంతెత్తి గానీ, మెల్లగా మనలో మనమే పాడుకుంటున్నట్టుగా గానీ.... పాడుకోవటం కూడా చాలా పరవశం కలిగిస్తుంది కదూ! సంగీతానికున్న శక్తి అలాంటిది! అది సరేగానీ... నువ్వు... ఎక్కడికి వెళ్ళి వస్తున్నావు... బడినుండి కాదని తెలుస్తూనే ఉంది!"

ఆవిడ ప్రశ్నకి సీత చిరునవ్వు నవ్వింది.

"పద్మనాభం గారి ఇంటికి వెళ్ళి వస్తున్నానమ్మా...!"

ఆ మాటకి గోదారమ్మ కళ్ళు చిట్లిస్తూ సీతవైపు ఆశ్చర్యంగా చూసింది.

"ఆయన మంచం పట్టాడని విన్నానే...! నువ్వెందుకు వెళ్ళినట్లూ...?" అంటూ విస్తుపోయిందావిడ.

సీత నిట్టూర్చింది.. "అవునమ్మా ఆ విషయం నాకూ తెలిసింది... అందుకే ఆవిడకు కొంచె పనుల్లో సాయం చేసి వద్దామనీ..." సీత నసుగుతూ చెబుతూంటే గోదారమ్మ మరింత ఆశ్చర్యపడింది.

"ఏమిటీ...?! అతను మంచం పట్టాడని... వాళ్ళావిడకు సాయం చేద్దామని వెళ్ళావా... నిజమేనా...?"

ఆవిడ ఆశ్చర్యానికి కారణం ఉంది.

గోదారమ్మ సీతా వాళ్ళింట్లో చేరిన మొదట్లో... ఒకరోజు పద్మనాభం గారు వాళ్ళింటి ముందునుండి వెళ్తోంటో... సీత, ఆవిడకు అతన్ని చూపించి ఓ మాట చెప్పింది. "ఈ వూళ్ళో నన్ను బాగా ఇబ్బంది పెట్టింది ఎవరైనా ఉన్నారంటే...ఈయనేనమ్మా. నేను ఈ ఊరు బడిలో ఉద్యోగంలో చేరటానికి వచ్చినపుడు, స్కూలు గదిలోనే వుంటూ నాన్నా, నేనూ అద్దెకోసం తిరిగాం. ఈయనేమో 'భర్త లేకుండా పిల్లాడితో ఒంటరిగా ఉంటున్నానంటోంది అంటే...

ఈవిడవల్ల తప్పకుండా చాలామంది కాపురాలు కూలిపోవటం ఖాయం అని నాకనిపిస్తోంది. ఇలాంటి వాళ్ళని... ఇల్లిచ్చి పెట్టుకోవటం అంటే కొంపలో కొరివిని పెట్టుకున్నట్లుగా ఉండదూ'..." అంటూ అందరికీ చెప్పి మాకు అద్దెకు ఇల్లు దొరక్కుండా చేసేడమ్మా... అందుకే ఈయనంటే చాలా కోపం... ఆడవాళ్ళంటే అంత తేలిక అభిప్రాయం ఈయనిది. ఒంటరిగా వుంటూ అవస్థలు పడకుండా ఉండేందుకు వీలయితే వాళ్ళకి సాయం చేయాలి. అంతేగానీ, పనిగట్టుకుని అసత్య ప్రచారం చేసి వాళ్ళని ఇబ్బంది పెట్టాలనుకోవటం మంచి సంగతి కాదుకదమ్మా...?" అని ఆనాడు చెప్పిన సీత ఈ రోజు ఇలా చేయటం ఏమిటీ? అతను చేసిన ద్రోహాన్ని మరిచిపోయిందా...?

ఆమాటే ఆవిడ సీతను అడిగింది.

సీత ఏం చెప్పాలో తెలియనట్లుగా ఓ నిమిషం మౌనంగా చూసింది.

"అతను నా మీద కక్షగట్టినట్లుగా ఇబ్బంది పెట్టటం నిజమేనమ్మా...! అందుకే నాకూ అతనిమీద చాలా కోపం ఉండేది. కానీ అతను అనారోగ్యంతో మంచం మీదనే ఉంటున్నాడనే కబురు విని 'బాగా శాస్తి జరిగిందిలే' అని సంతోషపడటం భావ్యం కాదనిపించింది. ఈ రోజు బడికి వాళ్ళ పిల్లలు సరిగా జుట్టు దువ్వుకోకుండా చింపిరి తలలతో వచ్చారు. నాకు చాలా జాలివేసింది. వాళ్ళని కారణం అడిగితే, వాళ్ళమ్మకి అస్సలు ఖాళీ ఉండటం లేదట. వాళ్ళ నాన్న పనులు, ఇంటిపనులతోనే బాగా అలసిపోతోందని వాళ్ళు చెప్పారు. ఆవిడకు సాయంగా రావటానికి తోడబుట్టిన వాళ్ళెవరూ లేరు. ఆ పైన బంధువులెవరితోనూ ఆయనకు సత్సంబంధాలూ లేవు. పిల్లలకు నిత్యమూ 'తన కోపమే తన శత్రువు' అనీ, 'అపకారికి ఉపకారము' అనే నీతుల పద్యాల గురించి చెబుతూ వాళ్ళతో వల్లె వేయించే నేను కొంచెమైనా ఆచరణలో పెట్టకపోతే ఎలా అనే ఆలోచన వచ్చింది.

నిజమే కదమ్మా... అతను నన్నేదో ఇబ్బంది పెట్టాడనే భావంతో సాయం చేయకపోవటం తప్పేకదా... అనుకున్నాను. అందుకే... ఓ నాలుగు రోజులు బడికి సెలవుపెట్టి... ఆవిడకు, వంట, ఇంటి పనుల్లో సాయం చేస్తానని చెప్పివచ్చాను. అతని పనులు చేయాల్సిరావటం ఆవిడకు ఎలాగూ తప్పదు. మిగతాది అయినా కొంత తగ్గటం బావుంటుంది కదా... ఇపుడే ఆ మాట చెప్పి వస్తున్నాను. రేపటి నుండి ఉదయం కొంచెం ముందుగా నిద్రలేస్తే... ఇంట్లో పనులు పూర్తిచేసి, అక్కడికీ వెళ్ళి వాళ్ళకూ సాయంచేసి రావ చ్చును. నేనూ అలిసిపోకుండా ఓ నాలుగు రోజులు సెలవుపెట్టాను."

సీత ముగించగానే "మంచి పనిచేసావు సీతా... మనం చేయగలిగిన సాయం చేసినపుడు కలిగే సంతృప్తి, సంతోషం ఎంతటి సంపదకూ సరికావు! అలాంటి మార్గంలో పొందే ఆ ఆనందాన్ని అనుభవించినవాళ్లు ఎంతటి కష్టనిష్ఠూరాలు ఎదురైనా తమ నిజాయితీని వదిలిపెట్టరు! అంతేకాదు, తమ-పర భేదం చూపరు " అంటూ గోదారమ్మ చిరునవ్వుతో సీత వైపు చూసింది.

ఒక క్షణం తర్వాత ఆవిడే మళ్ళీ అంది. "నీ మాటలు వింటోంటే... సీతా, నాకూ మా అమ్మ గుర్తుకు వచ్చింది...!"

సీత కొంచెం ఆశ్చర్యంగా "ఎందుకనమ్మా...?" అనడిగింది.